# దొంగ

బస్సు కిటకిటలాడుతోంది. సీట్లలో వాళ్ళు సీట్లలో కూచోగా, సీట్లమధ్య కొందరూ, మధ్యదార్లో కొందరూ, ఒకరికీ ఒకరికీ మధ్య సందు లేకుండా నించుని వున్నారు. వెనకాల నించున్నంత మందీ ముందూ నించున్నారు. ఒంటి చేతిమీద మెట్ల మీద నిలబడ్డవాళ్ళు కొందరైతే, వాళ్ళని పట్టుకుని నిలబడ్డవాళ్ళు మరికొందరున్నారు. ఏమాత్రం వెలితి లేకుండా నిండుగా వున్న ఆ బస్సు 'పూర్ణ గర్భిణి'లాగా నిదానంగా కదిలింది.

అంతమంది దొరలున్న బస్సులో దొంగలూ వుంటారు. ఆ దొంగల్లోని ఒక దొంగ, అదను కోసం నిరీక్షిస్తున్నాడు. అతని ఓ కన్ను ప్రయాణీకుల పాంటు జేబుల మీదా, చొక్కా జేబులమీదా వుంది. ఇంకో కన్ను పెద్ద జుబ్బాల పక్కజేబుల కోసం వెతుకుతోంది...

ఇవాళ తనకి గట్టి పర్సొకటి దొరకాలి. అందులో కనీసం రెండువందలైనా వుండాలి. ఆ డబ్బు దొరికితే, వున్న వందరూపాయిల అప్పూ తీర్చేయొచ్చు. మరో ఇరవై రూపాయిల అవసర ఖర్చుంది. అదిపోగా మిగిలిన డబ్బు రెండురోజుల వరకూ పని కొస్తుంది. నాలుగురోజులనుంచి ఉల్లిపాయలు తెమ్మని చెబుతోంది తన భార్య. 'కుర్ర వెధవకి బొమ్మల పుస్తకం కొంటానని వారం రోజులుగా ఆశపెడుతున్నాను. ఇవాళ ఈ రెండు వస్తువులూ ఎలాగైనా కొనుక్కుని వెళ్ళాలి.'

దొంగ చెయ్యి రెపరెపలాడుతోంది. కళ్ళు చాకుల్లా పొడుస్తున్నాయి. ఆడ, మగ తేడాలేకుండా సందు ఎరగని జనం ఇరుక్కుపోతూనే కదుల్తున్నారు. ఎక్కేవాళ్ళు ఎక్కడానికి కష్టపడ్డట్టే, దిగేవాళ్ళూ దిగడానికి కష్టపడుతున్నారు.

దొంగ బుర్రలో ఆలోచనలు సుళ్ళుసుళ్ళుగా తిరుగుతున్నాయి. ఒకవేళ, ఇంకా పెద్ద మొత్తం గల పర్సే దొరికితే?... తనో పాంటూ చొక్కా కొనుక్కోవచ్చు. భార్యకో చీర కొనవచ్చు. అంతే! అంతకంటే ఖర్చు పెట్టకూడదు! తక్కినదంతా జాగ్రత్తగా దాచుకోవాలి...

బస్సు జోరుగా వెళ్తున్నప్పుడు అది బస్సో ఓడో తెలియడం లేదు. నీటిమీద పడవ వూగినట్టు వూగుతోంది.

'రేపు' ఆలోచన తనకి లేకపోబట్టే, తన బతుకు ఈ బస్సు వూగినట్టుగా వూగుతోంది. ఏ బ్యాంకులోనన్నా ఖాతా ఆరంభించి, మిగిలిన డబ్బు ఏదైనా వుంటే - అందులో పడేస్తే క్షేమంగా వుంటుంది.

ఒకవేళ చిన్న మొత్తమే లభిస్తే?... దొంగ గుండెలో బస్సు హారన్ 'గంయ్'మని కొట్టింది. అమ్మో - లాభంలేదు! నాల్గైదు రూపాయల పర్సుల వల్ల శ్రమే గాని, ప్రయోజనం లేదు! తను కాఫీ అయినా తాగలేడు సరికదా, ఆ డబ్బులు ఉల్లిపాయలకే సరిపోతాయి. అంచేత, బీదవాడిలాంటి వాడి జేబుకొట్టి ప్రయోజనం లేదు. గట్టి పిండం ఎవడైనా దొరకాలి, వాడి దగ్గర దిట్టమైన పర్సు లభించాలి!... ఏమో! తన అదృష్టం ఎలా వుందో! తనకి గట్టి పర్సు దొరికేలా చెయ్యమని దొంగ, కళ్ళు మూసుకుని దేవుని ధ్యానించుకున్నాడు!

దొంగ రెండుకళ్ళూ ఐకమత్యంగా వెళ్ళి, ఒక పాంటు వెనక జేబుమీద పడ్డాయి. ఆ వెనక జేబు పైన రెండంగుళాలమేర, తన వేళ్ళకి దొరికేలాగా పర్సు మెరుస్తోంది... అందులో ఎంతుంటుందోనని తను ఇప్పుడు ఆలోచించరాదు. బస్సులో వున్న రద్దీ తగ్గిపోయే లోపల, ఏదో ఒక పర్సు దక్కించుకోవాలి. ఎందుకైనా మంచిది - ఇది 'రిజర్వ్'లో వుంచుకోవాలి.

బస్సు – స్టాపుల్లో ఆగినట్టే ఆగి, బయల్దేరుతోంది. జనం ఎక్కుతున్నారు; దిగుతున్నారు. జనమధ్యంలోనే కాక, అవస్థలో కూడా ఇరుక్కున్న కండక్టరు ఈలలు వేస్తున్నాడు.... ఏదేదో అరుస్తున్నాడు... బస్సు హారన్... జనం గోల... కండక్టరు ఈల... ఓ స్టాపులో జనం జలపాతంలో కొట్టుకొచ్చినట్టు, బస్సు నుంచి జారారు. అలా అలా జారిన వాళ్ళలో దొంగ కూడా ఒకడు.

పేవ్‌మెంట్ మీద నడుస్తున్న దొంగ వెనక్కి చూశాడు. బస్సు రంయ్‌మని వెళ్ళి రద్దీలో కలిసిపోయింది. దొంగ నిట్టూర్చాడు. అటూ ఇటూ చూశాడు. జేబులో చెయ్యిపెట్టి తడుముకున్నాడు. లభించిన పర్సు భద్రంగానే వుంది. ఈ రద్దీలో తన దగ్గర్నుంచి ఇంకోడెవడూ కొట్టెయ్యలేదు!

దొంగకి నవ్వొచ్చింది. ఆనవ్వులో నాలుగు అర్థాలు వినిపించాయి. అతనిలో ఆత్రుత ఎక్కువైంది. పర్సులో ఎంతుందో చూడాలి. చూడాలంటే తన ముందూ వెనకా మనుషులు లేకుండా చూడాలి. ఎవరికీ అనుమానం కలగకుండా తన సొంత

పర్సు తీసినట్టుగా తీసి చూడాలి. దొంగ చిన్న సందులోకి తిరిగాడు. కనుచూపు మేరలో మనిషెవడూ లేకుండా చూసుకున్నాడు. దడదడలాడుతున్న గుండెచప్పుడుని అదిమిపట్టాడు. జేబులోంచి పర్సులాగి చూశాడు. చెయ్యి లోపలపెట్టి వేళ్ళతో వేగంగా వెతికాడు. మొత్తం అంతా కలిపి పదహారు రూపాయిలుంది! అతని గుండె జారిపోయింది. అయినా ఇంకా వెతికాడు. మడతల్లో వున్న ఒక ఉత్తరం దొరికింది. ఛీ! ఉత్తరాలు, కాయితాలు! బుద్ధిలేని చవట! తన వూహ, పథకం అంతా వృథా చేసేశాడు! పర్స్ ముందు అరలో పాస్‌పోర్ట్ సైజు ఫోటో ఒకటుంది. ఈ పర్సు గలవాడు వీడే అయి వుంటాడు. ఫోటో బయటికి లాగి అటూ ఇటూ చూశాడు. ఎక్కడా పేరు, ప్రఖ్యాతీ లేవు! 'ఎవడో అనామకుడు' అనుకున్నాడు దొంగ. నెమ్మదిగా నడుస్తూ ఉత్తరంలో ఏముందో చూడాలని తీసి చదివాడు:

''ప్రియమైన అన్నయ్యకి!

చెల్లెలు రేణు నమస్కరించి వ్రాయునది. మన ఊరిలో మన ఇంటిప్రక్కన వున్న జానకమ్మగారికి ఒంట్లో ఏమీ బాగులేదు. పాపం నేడో రేపో అన్నట్టుగా వుంది. రాయలేక రాయలేక వాళ్ళ అబ్బాయికి ఉత్తరం రాసి నీకు పంపమన్నారు. ఇందులో పంపుతున్నాను. నీవు ఈ ఉత్తరం స్వయంగా అతనికి అందజేసి, వెంటనే బయల్దేరమని చెప్పు. మందులకీ, డాక్టర్ ఫీజుకీ లేకుండా జానకమ్మగారు బాధపడు తున్నారు. ఎంత వీలయితే అంత తీసుకుని వాళ్ళ అబ్బాయిని బయల్దేరమని చెప్పు. ఆవిడ, అతనికి లోగడ ఎన్నో ఉత్తరాలు రాస్తే ఏదానికీ జవాబు రాలేదట. అందుకని నీకు పంపి, స్వయంగా ఈ ఉత్తరం అందజేయమన్నారు. ఆలస్యం చెయ్యకుండా వెంటనే వెళ్ళి ఈ విషయం చెప్పి అతనికి ఉత్తరం ఇవ్వు. చాలా అర్జెంటుగా భావించు. జవాబు వ్రాయగోరుతున్నాను.

- చెల్లెలు సుగుణ''

ఈ ఉత్తరంతోపాటే మడిచివున్న మరో ఉత్తరంకూడా చదివాడు. అది ఆ అబ్బాయికి వాళ్ళమ్మ రాసిన ఉత్తరం. విషయం ఇంచుమించు అదే. అయితే తను వాడిని చూడాలనుకుంటున్నట్టూ కడసారి చూపయినా దక్కించమన్నట్టూ ప్రాధేయ పడుతూ రాసిందావిడ.

తనకి అనవసరం అనుకుంటూనే దొంగ రెండు ఉత్తరాలూ మరోసారి చదివాడు. ఈ పర్సుగల ఆసామి ఆ తల్లి చివరి కోరికను కొడుక్కి అందించడానికి వెళ్తున్నాడు కాబోలు!... మరి ఈ ఉత్తరం తన చేతిలో మిగిలిపోయింది. అతనెలా అందజేస్తాడు పాపం!... అందజెయ్యలేడు!... అయినా విషయం వివరిస్తాడుగదా. వివరించినా తల్లి స్వయంగా రాసిన ఉత్తరం ఇవ్వలేడుగదా! ఆ అబ్బాయి ఈ ఉత్తరం

స్వయంగా చూడగలిగితే, ఆ ప్రభావం వేరు. అనవసరంగా ఈ ఉత్తరం వచ్చి తన చేతిలో ఇరుక్కుపోయిందే... ఆ ఉత్తరాన్ని అటూ ఇటూ తిప్పిచూశాడు. ఎక్కడా ఎలాంటి చిరునామా లేదు!

జేబుకొట్టే ఏ దొంగేనా కొట్టేది పర్సే - కాని అతనికి కావలసింది పర్సుకాదు - పర్సులో వున్న డబ్బు! అంచేత దొంగ, పర్సుగల వాడిని శాపనార్థాలు పెడుతూ, చాలా నిరుత్సాహంగా, ఆ వున్న డబ్బునే జేబులో పెట్టుకుని, పర్సు ఆ ఉత్తరాలూ రోడ్డు పక్కనే ప్రవహిస్తున్న కుళ్ళు కాలవలో విసిరెయ్యబోయి - ఆగాడు! ఎందుకో పర్సులో వున్న ఫోటోకేసి చూడబుద్ధయి, ఇంకోసారి చూశాడు. చిన్న మీసం, దిద్దిన క్రాపుతో వున్నాడు - కుర్రాడే. ఏ చిన్న ఉద్యోగంలోనో వుండివుంటాడు... లేక ఈఫోటో ఈ పర్సుగలవాడిది కాదా... ఏమో! ఈ ఆరాలన్నీ తనకెందుకూ?... తనకి కావలసింది డబ్బు - అంతే! దొంగ అటూ ఇటూ చూసి, తనని ఎవరూ గమనించడం లేదని నిర్ధారణ చేసుకున్న తర్వాత - ఫోటోతోసహా ఆ పర్సును కాలవలోకి గిరవాటేశాడు! ఉత్తరాలు మాత్రం ఇంకోచేతిలో వుండిపోయాయి!

ఆ ఉత్తరాలు కనిపించగానే, దొంగకి ఆ తల్లిమీద జాలి వేసింది. కొడుకుకోసం ఆతల్లి ఎంతగా తపించుకుపోతోందో! ఈ కొడుకు ఏకాస్త డబ్బో తెచ్చి తనకి మందులూ అవీ కొంటాడని ఆమె ఆశ! ఆ కొడుకును చివరిసారిగా ఓసారి చూసుకోవాలని ఆమె ఆశ!... అవసాన దశలో తన తండ్రికూడా తన కోసం ఇలాగే పరితపించిపోయాట్ట!... దొంగ మనసు విలవిలలాడింది... తన దొంగతనం మూలంగా ఆతల్లి ఆశ నిరాశ అయింది! ఈ పర్సుగల కుర్రాడు పర్సు పోయిందని వెతుక్కుంటూ ఎక్కడో తిరుగుతూ వుంటాడు. అతని దగ్గర వున్నది ఈ పదహారు రూపాయలేనేమో! అవీ జేబులో లేకపోతే తిరిగి తన యింటికి వెళ్లడం ఎలా అని ఆలోచించి, అసలు ఆ కొడుకు దగ్గరకే వెళ్ళడం మానేస్తాడేమో!...

దొంగ మనసు పరిపరి విధాల పోయింది. పోనీ తనయినా వెళ్ళి ఈ వార్త అందించవచ్చునంటే, ఈ పర్సు గల కుర్రాడెవరు? ఆ అబ్బాయి ఎక్కడ వుంటాడు? ఏమీ తెలీదు...

డబ్బు దొరకాలని తను ఆశపడి, పర్సు కొట్టేస్తే అందులో ఇలాంటి ఉత్తరం వుండి, తనని పెద్ద చిక్కులో పడేసింది! ఏం చెయ్యాలో దొంగకి పాలుపోలేదు... ఆ ఉత్తరాలు రెండూ భద్రంగా జేబులో పెట్టుకుని ఫోటోలోని కుర్రాడి పోలికలు గుర్తు తెచ్చుకుంటూ, తను దిగిపోయిన బస్సుస్టాపు ప్రాంతంలో దిక్కులు చూస్తూ నించుని ఆ ఉత్తరం ఆ అబ్బాయికి అందించడం ఎలా అని - ఆలోచనలో పడ్డాడు దొంగ! □